క్లుప్తంగా...

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను అందుకుంటున్న కొమ్ము అశోక్‌యాదవ్

లాలాపేట: ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ నుంచి కొమ్ము అశోక్ యాదవ్ సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. శనివారం తమిళనాడులో జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమీ అడ్వయిజరీ బోర్డు ఫౌండర్, హెడ్ కోచ్ వి.బాబు విజయన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈయన గత కొన్ని ఏళ్ల నుంచి దాదాపుగా 5 వేల మందికి నిత్యావసర పంపిణీ సాయివైకుంఠ ట్రస్ట్ ద్వారా దాదాపు 15 వేల మందికి ఉచితంగా హోమియో మందులు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దాదాపు 2 వేల మందికి కళ్లద్దాలను అందజేశారు. అశోక్ యాదవ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది.

నూతన సీవరేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలి



జలమండలి అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో పురాతన డ్రైనేజీ పైప్‌లైన్లను తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడంతో కలుషితజలాల సరఫరాతో పాటు పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. వర్షాకాలంలో ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హేమ కోరారు. పురాతన పైప్‌లైన్లను గుర్తించి నూతన పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని డీజీఎం కృష్ణ తెలిపారు. సమావేశంలో జలమండలి మారేడుపల్లి డీజీఎం కృష్ణ, అధికారులు అన్విత్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ నేత వెంకటేష్ శర్మకు నివాళి

లాలాపేట: తెలంగాణ ఉద్యమ నాయకుడు మల్లారపు వెంకటేష్ శర్మ(45) అనారోగ్యంతో గాంధీ హాస్పిటల్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి శనివారం వెంకటేష్ శర్మ మృతదేహానికి నివాళి అర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, విజయ డెయిరీ జీఎం మోహన మురళి, వరంగల్ జిల్లాకు చెందిన బీఎస్పీ నాయకులు గంధం శివ, విజయ డెయిరీ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొరపాక అంజన్న, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు కందుల మధు, వేల్పుకొండ వెంకటేష్, కోతి విజయ్, ఎర్రవెల్లి కృష్ణ, దేవరకొండ తదితరులు నివాళులర్పించారు.

బీజేపీకి బీ-టీం బీఆర్ఎస్: కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

రాంగోపాల్‌పేట్: బీజేపీకి బీ-టీం బీఆర్ఎస్ అయితే బీఆర్ఎస్‌కు బీ-టీం కాంగ్రెస్ అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో తెలంగాణకు చెందిన 78 నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించి నియామకపు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీకి భయపడి కేసీఆర్ ఆ పార్టీకి బీటీంగా మారారని, గత ఎన్నికల్లో 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిస్తే 16 మంది బీఆర్ఎస్‌లోకి వెళ్లారని అందుకే రెండు పార్టీలకు ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్లేనని అన్నారు. సమాజంలో మార్పు, దేశం, రాష్ట్రాలకు ఉన్న అప్పులు తీర్చేందుకు ప్రజా శాంతి పార్టీని గెలిపించాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికత్వం చచ్చిపోయాయని దీనికి ప్రధాన మంత్రి మోదీ, ఆర్ఎస్ఎస్‌లే కారణమన్నారు. మోదీ పాలనలో 150 మిలియన్ల క్రైస్తవులు, 30 కోట్ల ముస్లింలు భయంతో జీవిస్తున్నారన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించి అందరూ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు.

- ప్రజాశాంతి పార్టీనే బీఆర్ఎస్‌కు అసలైన ప్రత్యర్థి అని ఈ విషయం కేటీఆర్ ఓ టీవీ ఇంటర్వ్యూలో చెప్పారని కేఏ పాల్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాశాంతి పార్టీతో పొత్తుపెట్టుకుంటే బీఆర్ఎస్ ఉండదని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్‌లో ఏ రెడ్డి మిగలడని పాల్ పేర్కొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

బౌద్ధనగర్: అన్ని మతాలు, కులాల ప్రజల సహజీవనానికి తెలంగాణ ప్రాంతం ప్రతీకగా నిలుస్తోందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. మొహర్రం సందర్భంగా శనివారం అంబర్‌నగర్ ఛిల్లా, వారాసిగూడ ప్రాంతాల్లో షర్బత్ పంపిణీ శిబిరాల్లో డిప్యూటీ స్పీకర్ కార్పొరేటర్ కంది శైలజతో కలిసి షర్బత్ పంపిణీ చేశారు. ముస్లిం సాంప్రదాయాలను తాము సంపూర్ణంగా గౌరవిస్తామని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ, నాయకులు కంది నారాయణ, సుంకు రామ్‌చందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పీర్లను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ తదితరులు

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: ఎంతో మంది త్యాగాలకు ప్రతీక అయిన మొహర్రం పర్వదినాన్ని శనివారం అడ్డగుట్టలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పీర్లను ఎత్తుకొని బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా వీధి వీధి తిరిగారు. భక్తులు పీర్లను దర్శించుకొని కానుకలు సమర్పించారు.

కంటోన్మెంట్ నియోజకవర్గంలో..

రసూల్‌పురా: కులమతాలకు అతీతంగా మొహర్రంను జరుపుకుంటారని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని కాకాగూడ, రసూల్‌పురా, బోయిన్‌పల్లి, బాలంరాయిలోని పలు ఆషూర్‌ఖానాలు ముస్లిం మత పెద్దలతో కలిసి సందర్శించి పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవదూత మహ్మద్ ప్రవక్త మనుమలు హసాన్, హుస్సేన్‌ల వీరోచిత ప్రాణత్యాగాన్ని జ్ఞాపకం చేసుకుంటూ పీర్లను పది రోజుల పాటు ప్రతిష్టిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాజర్, అమర్, ఫహీం, ముక్తార్, చోటు, ఇలియాస్, అమీర్, సబీరా, జరీనా, యూనస్, సబేర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

- 7వవార్డులో లాస్య నందిత, నివేదిత పీర్లను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం తెలుగు రాష్ట్రాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో నాసర్, గఫర్, గౌస్, అమీర్, సమీర్, శ్యామ్‌రెడ్డి పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వ్యాప్తంగా మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్ఎస్ నేత శ్రీగణేశ్ సిక్ విలేజ్, తాడ్ బంద్, కాకాగూడ లోని పలు పీర్లనుఎ సందర్శించారు. తెలంగాణలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రంను అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఖాజా, దావుద్, సలీం, అన్వర్, సుభాన్, షార్పు, తాజ్, నసీర్, గౌస్, అహ్మద్, పాల్గొన్నారు.



పీర్లను దర్శించుకున్న మన్నె క్రిశాంక్, తదితరులు



పీర్ల వద్ద బీఆర్ఎస్ నేత శ్రీగణేశ్



అడ్డగుట్టలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్, బోయిగూడ, భోలక్‌పూర్, మోండా మార్కెట్, రాణిగంజ్, బండమైసమ్మనగర్ తదితర ప్రాంతాల్లో మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్యాండ్‌మేళాల నడుమ పీర్లను ఊరేగించారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పీర్లను ఊరేగించి కర్బలామైదాన్ వద్ద నిమజ్జనం చేశారు. మొహర్రం సందర్భంగా రాణిగంజ్ రోడ్లు ప్రజల సందడితో కోలాహలంగా కనిపించాయి.

లాలాపేటలో..

లాలాపేట: లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. అస్సైదూలా..అంటూ పాటలు పాడుతూ ఆలవా ఆడారు. ఈ సందర్భంగా మహ్మద్ మసూద్ అలీ మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి చిహ్నంగా ప్రతి ఏటా మొహర్రం జరుపుకుంటారని వివరించారు.

చిలకలగూడలో..

చిలకలగూడ : చిలకలగూడలో హఫీజ్, హనీమున్నీషా వంశస్థుల ఆధ్వర్యంలో శనివారం పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హజరత్ అలీ అబ్బాస్, ఇమామీఖాసీంల పీర్లను చిలకలగూడ, నామాలగుండు, శ్రీనివాసనగర్, వేంకటేశ్వరనగర్, కిందిబస్తీ, అన్నానగర్ తదితర ప్రాంతాల్లో ఊరేగించి కర్బలా మైదానంలో నిమజ్జనం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశరావు పీర్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మొహ్మద్ మహ్మద్‌జకీలతోపాటు ముస్లిం మత పెద్దలు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, యువకులు



పీర్లను దర్శించుకుంటున్న నోముల ప్రకాశరావు



లాలాపేటలో పీర్ల ఊరేగింపు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



స్థానికులతో మాట్లాడుతున్న సాయిబాబా

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం ఆయన బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, కలుషిత జలాలు తదితర సమస్యలతోపాటు పక్కనే ఉన్న రైలు కట్ట దిగువ నుంచి విషసర్పాలు బస్తీలోకి చొరబడుతున్నాయని, రైలు పట్టాల వెంబడి ప్రహరీ నిర్మించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని బస్తీవాసులు తెలిపారు. సంబంధిత అధికారులు, రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, బస్తీలోని శివాలయాన్ని అభివృద్ధి చేస్తానని నాగులూరి సాయిబాబా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సందీప్‌రాజ్, మల్లేష్, కుమార్, చందర్, ముకుంద్, నరసింహ, శ్యామ్, గుంటికృష్ణ పాల్గొన్నారు.

చిత్తశుద్ధి లేని నేతల కారణంగా ఎస్సీ వర్గీకరణ ఆలస్యం

మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

రసూల్‌పురా: నిజాయితీ చిత్తశుద్ధి లేని పాలకుల వాగ్దానాల కారణంగా ఎస్సీ వర్గీకరణ జరగడానికి ఆలస్యమవుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో శనివారం బీజేపీ సీనియర్ నేత చింత సాంబమూర్తి ఆధ్వర్యంలో బీజేపీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు జరగకపోతే విద్యా ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో మాదిగలకు అన్యాయం జరుగుతుందని అందుకే 29 ఏళ్లుగా రాజీ లేకుండా పోరాటం చేస్తున్నామన్నారు. వర్గీకరణ న్యాయమైంది కనుకనే 1996లో బీజేపీ మద్దతు తెలుపుతూ తిరుపతిలో తీర్మానం చేసిందని కాని దేశంలో ఎన్నో కీలక బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించుకుంటున్న బీజేపీ ఒక్క వర్గీకరణ బిల్లును మాత్రం విస్మరిస్తోందని అన్నారు. జనవరి 8న వరంగల్ సభలో ప్రధాన మంత్రి మోదీని కలిసిన సందర్భంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీచ్చారని తక్షణమే ఆ హామీని నెరవేర్చాలన్నారు. జాతీయ కార్యదర్శి మురళీధర్ రావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయమై అన్ని వర్గాల మద్దతు తీసుకోవాలని బీజేపీ సుముఖంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణ తార, నాయకులు వేముల అశోక్. జాజుల గౌరి, బోసుపల్లి ప్రతాప్, గోవిందు నరేష్ మాదిగ, ఏడెల్లి అజయ్, బాలకృష్ణ, దేవాని సతీష్ కొండ్రు పురుషోత్తం, దేవేందర్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'



నార్త్‌లాలాగూడలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లోని నార్త్ లాలాగూడ, ఇందిరానగర్, శేషాపహాడ్ తదితర ప్రాంతాల్లో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు తగ్గినా కూడా మురుగునీటి ప్రవాహం, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, దెబ్బతిన్న రోడ్ల సమస్యలను పరిష్కరించడంలో స్థానిక కార్పొరేటర్ విఫలమైయ్యారని ఆరోపించారు. ఇళ్లలో నుంచి బయటకు వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచే నడవాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో శంకర్, నాగేశ్వర్‌రెడ్డి, వీరన్న, ప్రకాష్‌గౌడ్, శారద, ఉదయ్, శివాజి, వేణు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



మెఘావత్ దాతు

చిలకలగూడ : వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యమైన ఘటన చిలకలగూడ, వారాసీగూడ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. నామాలగుండుకు చెందిన మెఘావత్ దాతు (23), జతావత్ రేణుకాకు మూడు నెలల క్రితం వివాహమైంది. ప్రైవేటు ఉద్యోగైన మెఘావత్ దాతు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకుంటున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని పలుమార్లు వారించిన వినలేదు. ఇదే విషయమై ఈనెల 28న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లిన దాతు తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సన్నిహితులు, బంధుమిత్రులను ఆరా చేసినా ఫలితం లేకపోవడంతో రేణుకా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి..



షేక్‌మునీర్

మహ్మద్‌గూడ ఏకే ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన షేక్ మునీర్ (28) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 24న బయటకు వెళ్లి ఎంతకీ ఇంటికి రాలేదు. పనిచేసే చోటు అడిగితే ఉద్యోగానికి రాలేదని చెప్పారు. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం భార్య వాజీదాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో గృహిణి



జీనత్‌పర్వేజ్ షేక్

బౌద్ధనగర్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఓ మహిళ అదృశ్యమైంది. న్యూ అశోక్‌నగర్‌కు చెందిన జీనత్‌పర్వేజ్ షేక్ (36), కొన్నేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నెల 28న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మధ్యాహ్నం భర్త పర్వేజ్ షేక్ తన పిల్లలను తీసుకుని నమాజ్‌కు వెళ్లి ఇంటికి వచ్చేసరికి భార్య కనిపించలేదు. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భర్త శనివారం ఫిర్యాదు చేసినట్లు వారాసీగూడ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎవరిదీ మృతదేహం?



సనత్‌నగర్: నాలాలో కొట్టుకొచ్చిన గుర్తుతెలియని ఓ మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జయచందర్ వివరాల ప్రకారం.. నేచర్‌క్యూర్ ఆస్పత్రికి ఎదురుగా హెచ్‌పీఎస్ నాలా ఒడ్డున ఓ గుర్తుతెలియని వ్యక్తి నిర్జీవంగా పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. ప్రమాదవశాత్తూ నాలాలో దిగి వరద ఉద్ధృతికి కొట్టుకుపోయి మృతి చెందాడా? లేక మద్యంమత్తులో నాలాలో దిగి మృతి చెందాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉండొచ్చని సంబంధీకులు ఎవరైనా ఉంటే బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన 17 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శనివారం అందజేసి మాట్లాడారు. దేశం మొత్తం అనుసరించే విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం దక్కే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే కాకుండా ప్రజావసరాలను తెలుసుకుని ఎప్పటికప్పుడు సమకూర్చడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి



మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కారు వస్తేనే ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. శనివారం బోయిన్‌పల్లి లక్ష్మీ నర్సింహ కాలనీలో రూ.18 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన మంచి నీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని పలు పథకాలను రాష్ట్రంలో అమలు చేయకుండా కేసీఆర్ అడ్డుపడుతున్నారని పేదల కోసం రూ.5 లక్షల ఆరోగ్య భీమా కల్పించే ఆయుష్మాన్ భారత్ స్కీం తెలంగాణలో అమలు కాకుండా చేశారని ఆరోపించారు. మోదీ పాలనలో తొమ్మిదేళ్లుగా దేశంలో ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీని గెలిపించాలని కోరారు. కంటోన్మెంట్ అభివృద్ధి విషయంలో తీవ్ర వివక్ష చూపుతోందని రాజధానిలో అంతర్భాగంగా ఉన్న కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి నిధులు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో మల్లికార్జున్, సుష్మిత శంకర్రావు, బాణాల శ్రీనివాస్ రెడ్డి, బీఎస్ శ్రీనివాస్, భట్టు శంకర్, కృష్ణమోహన్, వెంకటేశ్ చారి, నరేశ్ బాబు పాల్గొన్నారు.

అన్నానగర్ దత్తత అన్న సీఎం ఎక్కడ : కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్: రేవంత్‌రెడ్డి కనిపించడం లేదంటూ కంటోన్మెంట్‌లో పోస్టర్లు వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేత డీబీ దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం పికెట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు రేవంత్‌రెడ్డి కనిపించడం లేదంటూ పోస్టర్లు వేయడం దారుణం అన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఢిల్లీలో ఉన్న విషయం మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశానికి హాజరై ప్రజా సమస్యలపై చర్చించిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. వరదలతో ప్రజలు సతమతమవుతూ ప్రాణాలు కోల్పోతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అన్నానగర్‌ను దత్తత తీసుకుంటానని చెప్పిన ముఖ్యమంత్రి ఏమైపోయారన్నారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఇవ్వాల్సిన రూ.46 కోట్ల సర్వీసు ఛార్జీలు విడుదల చేయించి తమ చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. బీజేపీ నేత, బోర్డు సభ్యుడు రామకృష్ణ బోర్డు అధికారులతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో గజ్వేల్ భరత్, నాగేశ్ యాదవ్, బాబూరావు, సాల్మన్, వినోద్, శ్రీను పాల్గొన్నారు.

371-డీ సవరణతోనే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ సమస్యకు పరిష్కారం

లాలాపేట: భారత రాజ్యాంగంలోని అధికరణ 371-డీని సవరణ చేయడం ద్వారానే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఓయూ లా కళాశాల డీన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ దండోరా ఆధ్వర్యంలో చేస్తున్న డిమాండ్ నెరవేరకపోవడానికి ప్రధాన కారణం ఆచరణ సాధ్యం కాని డిమాండ్లే అని పేర్కొన్నారు. రాజ్యాంగ అధికరణ 371-డీను సవరించాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో రెండొంతు మెజార్టీ, 50 శాతం రాష్ట్రాల్లో అసెంబ్లీ తీర్మానం జరగాల్సి ఉంటుందని కానీ ప్రస్తుతం ఇది జరిగే పరిస్థితి లేదన్నారు. జఠిలమైన కశ్మీర్ సమస్యను 370 అధికరణ రాష్ట్రపతి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో పరిష్కరించనట్లుగానే రాష్ట్రపతి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లను రెండు తెలుగు రాష్ట్రాల్లో జోనల్ పద్ధతి ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

క్రిష్టియన్ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూల దృక్పథం



సమావేశంలో మాట్లాడుతున్న రాయ్‌డిన్ రోచ్

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో ఉండే క్రైస్తవుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తుందని ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్, తెలంగాణ సినాడ్ కన్వీనర్ రాయ్‌డిన్ రోచ్ అన్నారు. శనివారం రెండు సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన ఎస్డీరోడ్‌లోని హాస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. ఈ నెల 26వ తేదీన సచివాలయంలో మైనార్టీ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ సలహాదారులు (మైనార్టీ వ్యవహారాలు) ఏకేఖాన్, మైనార్టీ శాఖ కమిషనర్ జలీల్‌తో సమావేశం జరిగిందని ఇందులో పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. ఉప్పల్ భగాయత్‌లో క్రిష్టియన్ భవన్ రీడిజైన్‌తో కొంత జాప్యం జరిగిందని దానికి రూ.10 కోట్లతో పాటు మరిన్ని అదనపు నిధులతో పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే 42 ఎకరాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేసి రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో సొంత స్థలంలో చర్చి నిర్మాణాలకు సర్పంచ్‌లు, మరికొందరు అడ్డుపడుతున్నారని చర్చి నిర్మాణాలపై జీవో ఉన్నా దాన్ని అర్థం చేసుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లగా దీన్ని సవరించే అవకాశాలుంటే చూడాలని ఆయన అధికారులకు సూచించారని చెప్పారు. క్రైస్తవులందరూ ఐకమత్యంతో ఉన్నా నాయకత్వ లోపం ఉందని దీన్ని పూరించాల్సిన అవసరం ఉందని బిషప్ సింగం తెలిపారు. ఈ సమావేశంలో ప్రతినిధులు సుధీర్‌కుమార్, శామ్యుల్, రెవరెండ్ జోనాథాన్, ఫాదర్ ఆంటోనీ వినయ్, సిస్టర్ థామస్ అమ్మ, సిస్టర్ వసంత పాల్గొన్నారు.

సేవలోనే సంతృప్తి



అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: సామాజిక దృక్పథంతో నిరుపేదలకు సేవలందించడంలో కలిగే తృప్తి అమోఘమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డలోని మానసిక వైద్య ఆస్పత్రికి వచ్చిన రోగుల సహాయకులకు శనివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజావసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చడంలో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్యంగా నిరుపేదలకు విద్యాదానం, అన్నదానం, వైద్య సహాయం చేయడంలో ఆత్మసంతృప్తి ఉంటుందని ఆ దిశగా లయన్స్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ, కార్యదర్శి మమత, రీజియన్ చైర్‌పర్సన్ ఆషా నిమ్మగడ్డ, జోన్ చైర్‌పర్సన్ ఆషా చింతలపల్లి, సంగీత, మాధవి, విజయలక్ష్మీ, ధర్మేందర్, అమరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రిని నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

అడ్డగుట్ట: స్థానిక ప్రజల సౌకర్యార్థం అడ్డగుట్టలో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడ్డగుట్టలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మారేడుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా ప్రయోజనాలకు వాటిని ఉపయోగించాలన్నారు. 1978-79లో అడ్డగుట్ట ఏర్పాటైనప్పటి నుంచి ప్రభుత్వ భూముల పరిరక్షణకు సీపీఎం పార్టీ ఎంతో కృషి చేస్తూ వచ్చిందని కానీ.. కొంత కాలంగా మండల పరిధిలోని అనేక ప్రభుత్వ భూములను సొసైటీల పేరుతో కొందరు, భూములు తమవేనని మరి కొందరు కబ్జాలు చేశారని ఆరోపించారు.దాదాపు 50 వేల జనాభా ఉన్న అడ్డగుట్ట, రెండు లక్షల జనాభా కలిగిన మారేడుపల్లి మండలాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి అనుగుణంగా 100 పడకల ఆస్పత్రికి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, గోపాల్, మహేందర్, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.